క్లుప్తంగా

ఈదురుగాలులకు రాలిన మామిడి కాయలు



రాయపర్తి: మండలకేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన కొద్దిపాటి వర్షం కురిసింది. కేశవాపురం గ్రామంలో రైతు రమేష్ మామిడితోటలో కాయలు రాలాయి. మండల కేంద్రం శివారులోని మసీద్‌గడ్డ వద్ద తాటిచెట్టుపై పిడుగుపడి కాలిపోయింది. ఆ ప్రదేశంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ప్లంబర్ యూనియన్ మండల కమిటీ ఎన్నిక



వర్ధన్నపేట : ప్లంబర యూనియన్ మండల కమిటీని పట్టణంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భాస్కర్, ఉపాధ్యక్షుడుగా కొండేటి శ్రీనివాస్, ముఖ్యసలహాదారుగా కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీను, కోశాధికారిగా రామగిరి భానుతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ధరలు నిర్ణయించినట్టు తెలిపారు. యూనియన్ నిర్ణయించిన ధరలను సభ్యులు పాటించాలని తీర్మాణం చేశారు.

రోగులకు పండ్ల పంపిణీ



నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రిలో డీఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాసరి సాంబరెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా రోగులకు ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై రోగులకు పండ్లు అందజేసి మాట్లాడారు. రోగులకు సేవలు అందించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ మనోజ్‌లాల్, ట్రస్ట్ సిబ్బంది మేకల రాజేందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



నల్లబెల్లి : మండలంలోని బుచ్చిరెడ్డిపల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీలో మహబూబాబాద్ పార్లమెంట్ ప్రభారీ నూకల వెంకటరమణారెడ్డి, నియోజకవర్గ చేరికల కమిటీ చైర్మన్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి సమక్షంలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి వెంకటరమణారెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి పుల్లారావు, మండల ఇన్‌చార్జ్ మల్యాల వినయ్ కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శి తడుక వినయ్, నాయకులు బచ్చు వెంకన్న, సుధగాని ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరాటాలే నిజమైన నివాళి

నర్సంపేట : ప్రజాపోరాటాలే సీపీఐ సీనియర్ నాయకుడు పంజాల చంద్రమౌళికి నిజమైన నివాళులని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్ తెలిపారు. పట్టణంలోని సీపీఐ కాలనీలో చంద్రమౌళి 7వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి చిత్రపటానికి రమేష్ నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అక్కపెల్లి రమేష్, జిల్లా సమితి సభ్యులు యాకయ్య, మియాపురం గోవర్ధన్, ఇల్లందుల సాంబయ్య, నాయకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని పెర్కవేడుకు చెందిన గడ్డం కమలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి ఆదివారం పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సంగెం : నేడు (సోమవారం) ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కాసర్ల రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కళావతి అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

రోడ్డు పక్కన బావులు.. పొంచి ఉన్న ప్రమాదాలు

- ప్రాణాలు పోతున్నా స్పందించని అధికారులు
- రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వేడుకోలు

సంగెం : రోడ్డు పక్కన బావులు మృత్యు కుహరాలుగా మారాయి. పలు గ్రామాల్లోని రోడ్ల వెంట బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, గ్రామాల్లోని అంతర్గత రోడ్ల వెంట ఉన్న వ్యవసాయ బావులకు ఎలాంటి రక్షణ గోడలు లేవు. వరంగల్–మహబూబాబాద్ ప్రధాన రహదారి వెంట ఆశాలపల్లి క్రాస్ సమీపంలో ఉన్న బావిలో ఈ నెల 3న పర్వతగిరి మండలం కొంకపాకకు చెందిన రైతు బొంత దేవేందర్ తన ద్విచక్ర వాహనంతో సహా పడిపోయి మృత్యువాత పడ్డాడు. ఇక్కడ ఆర్అండ్‌బీ రోడ్డు మలుపు ఉంది. బావి కూలి బీటీ రోడ్డు వరకు చొచ్చుకువచ్చింది. కనీసం షోల్డర్ కూడా లేకపోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. గతంలో గవిచర్ల–తీగరాజుపల్లి మధ్య ఉన్న వ్యవసాయ బావిలో జీపు పడిన సంఘటనలో డ్రైవర్ మృత్యువాత పడగా, పలువురు ప్రాణాలతో బయటపడ్డారు. ఎల్గూర్‌స్టేషన్–చంద్రగొండ రోడ్డులో పక్కన ఉన్న బావిలో ద్విచక్రవాహనదారుడు పడి గాయాలపాలై ప్రాణాలతో బయటపడ్డాడు. జాటోత్ తండా రోడ్డు పక్కన వరి కోత యంత్రం పడిపోగా డ్రైవర్ గాయాలతో బయట పడ్డాడు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి. మండలంలోని కాపులకనిపర్తి, ఆశాలపల్లి, గవిచర్ల గ్రామాల పరిధిలో ఆర్అండ్‌బీ రోడ్డు వెంట బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. కాట్రపల్లి–వెంకటాపూర్, కాట్రపల్లి–కాపులకనిపర్తి, ఎల్గూర్‌స్టేషన్–తూర్పుతండా, సంగెం–గవిచర్ల, ఎల్గూర్‌స్టేషన్–జాటోతు తండా తదితర రహదారుల వెంట ఉన్న బావులకు రక్షణ గోడలు లేవు. అధికారులు స్పందించి రోడ్ల వెంట ఉన్న బావులకు రక్షణ గోడలతోపాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆశాలపల్లి క్రాస్‌లోని బావిలో పడిన దేవేందర్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం (ఫైల్)

రక్షణ గోడలు ఏర్పాటు చేయాలి



రోడ్డు పక్కన బావులు మృత్యు కుహరాలుగా మారాయి. గతంలో గవిచర్ల వద్ద జీపుతో సహా పడి గ్రామానికి చెందిన డ్రైవర్ మృత్యువాత పడ్డాడు. తాజాగా ఆశాలపల్లి క్రాస్ రోడ్డు వద్ద రైతు బావిలో పడి చనిపోయాడు. అయినా సంబంధిత శాఖల అధికారుల్లో చలనం లేదు. రోడ్డు వెంట ఉన్న బావులకు రక్షణ గోడలు ఏర్పాటు చేసి ఇకనైనా ప్రయాణికుల, బాటసారుల ప్రాణాలు పోకుండా చూడాలి. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవు.

–మాసాని వెంకన్న, గ్రామస్తుడు, ఏనుగల్లు

సమస్య లేకుండా చూస్తాం

ఆశాలపల్లి వద్ద జరిగిన సంఘటన దురదృష్టకరం. అక్కడ రక్షణ గోడ ఏర్పాటు చేయడానికి ఏమాత్రం షోల్డర్ లేదు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని పోయి రక్షణ గోడ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

–సుమలత, ఏఈ ఆర్అండ్ బీ

ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికే ఓటేయండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

చెన్నారావుపేట : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికే ఓటేయాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని జల్లి, బోజెర్వు, పుల్లయ్యబోడు తండా, అమృతండా, ఎల్లాయగూడెం, ఖాదర్‌పేట, లింగాపురం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలోనే మండలంలోని గ్రామాలు అభివృద్ధి చెందాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనేక ఉచిత హామీలతో ప్రజలను మోసం చేశారని తెలిపారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ ఎన్నికల్లో మాలోతు కవితకు ఓటేసి భారీ మెజార్టీ అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ బానోతు పత్తినాయక్, సొసైటీ చైర్మన్ మురహరి రవి, నాయకులు బాల్నె వెంకన్న, జక్క అశోక్, తూటి శ్రీనివాస్, అనుముల కుమారస్వామి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం



వర్ధన్నపేట : ప్రచారం చేస్తున్న నాయకులు



పర్వతగిరి : ప్రచారం చేస్తున్న నాయకులు

వర్ధన్నపేట : వరంగల్ ఎంపీగా బీఆర్ఎస్ తరఫున బరిలో నిలిచిన మారపెల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు పట్టణంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అన్నమనేని అప్పారావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, కొండేటి సుధాకర్, ఐత ఎల్లయ్య, రహీం, కొండేటి రమేష్, గబ్బెట బాబు, మహబూబ్ అలీ, కొండేటి భాస్కర్, నర్సయ్య, యాదగిరి, ప్రశాంత్, కొండేటి సరిత, పద్మశ్రీ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని చౌటపల్లి, హట్యాతండాల్లో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షులు మట్టపెల్లి వంశీరావు, భూక్య తిరుపతి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ కురిమిళ్ల దుర్గారావు మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, తదితర సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని చెప్పారు. రైతుల ఆత్మహత్యలు పెరిగాయని తెలిపారు. మారెపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మట్టపెల్లి చిన్న మాధవరావు, మట్టపెల్లి లావణ్య, దామెర సారంగపాణి, రజని, గౌరారపు కుమారస్వామి, దేవరాజు, కుమారస్వామి, గౌరారపు చిన్న కుమారస్వామి పాల్గొన్నారు.

గోరుగుట్టతండాలో..

మండలంలోని గోరుగుట్టతండాలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బానోత్ వెంకన్న మాట్లాడారు. సుధీర్‌కుమార్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బూత్ కమిటీ కన్వీనర్ దేవేందర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు దేవేందర్, నాయకులు మోహన్, శీను, దేవేందర్, భాస్కర్, రమేష్, రవి, సుమన్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రాయపర్తి : సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు



దుగ్గొండి : జాగృతి హైస్కూల్ పూర్వవిద్యార్థులు

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 2006–07 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా గడిపారు. అనంతరం ఆత్మీయ సభ నిర్వహించి తాము జీవితంలో స్థిరపడిన, ఇతర అంశాలను చిన్ననాటి స్నేహితులతో పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు మూనావత్ మోహన్, మూనావత్ సంతోశ్, బాలాజీ, డి.సంతోశ్, పుట్టరాజు, నల్ల రవీందర్, తాటికాయల రాజు, దేవేందర్, జ్యోతి, అమల, స్వర్ణ, హరీశ్, లాక్య, రజిత, సరిత, మల్లేశ్, భద్రు, వేల్పుల కృష్ణ, సుజాత, మేడి రజిత, ప్రేమలత, సుధాకర్, ప్రవీణ్, హరీశ్, స్వప్న, రాధిక, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జాగృతి హైస్కూల్‌లో..

దుగ్గొండి : మండల కేంద్రంలోని జాగృతి హైస్కూల్‌లో 2001–02 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి తరగతి గదులను, పాఠశాల ఆవరణను సందర్శించి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు కష్టసుఖాలు, కుటుంబ పరిస్థితులు, ఇతరత్రా విషయాలు అడిగి తెలుసుకున్నారు. కష్టాల్లో ఉన్న సహచరులను ఆదుకోవాలని తీర్మానించుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు రవికుమార్, రంగారావు, భిక్షపతి, శ్రీరాంమూర్తి, రామకృష్ణ, పూర్వవిద్యార్థులు కూస సుమన్, సునీల్, మధు, రవి తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో విద్యార్థుల్లో వికాసం



నర్సంపేట : కరాటేతో విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి బాటలు పడతాయని కేఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ నరహరి రాజేందర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కేఎస్ఆర్ కాన్సెప్ట్ స్కూల్ గ్రౌండ్‌లో షూటోకాన్ జపాన్ కరాటే డూ ఇండియా హంబు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బెల్ట్ ఎగ్జామ్‌లో పట్టణానికి చెందిన విద్యార్థులు బేసిక్స్, కటాస్, కుమితే విభాగాల్లో ప్రతిభ కనబర్చి బెల్టులు, సర్టిఫికెట్లు సాధించినట్టు సంస్థ రాష్ట్ర టెక్నికల్ డైరెక్టర్ షిహన్ రచ్చ భవానిచంద్ బ్లాక్ బెల్ట్ 5వ డాన్ తెలిపారు. ఎల్లో బెల్ట్ విభాగంలో కుసుమ మనీష్, సుభాన్, అభిజ్ఞ, విష్ణుతేజ, మధుప్రియ, అభినవ్‌చారి, వరుణ్‌తేజ్, హార్దిక్, అక్షిత్, ఆరెంజ్ బెల్ట్ విభాగంలో మనీష్, భీమ్‌రావు, శ్రీహర్ష, సాత్విక్, మణిదీప్, గ్రీన్ బెల్ట్ విభాగంలో మనీష్, మహేంద్ర, బ్లూ బెల్ట్ విభాగంలో రిషిత్, పర్పుల్ బెల్ట్‌లో గురుచరణ్, బ్లాక్ బెల్ట్ 1వ డాన్‌లో పి.హర్షత్, దొడ్డ జ్ఞాన రితికిలకు ఆ సంస్థ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, టెక్నికల్ డైరెక్టర్ క్యోషి రచ్చ శ్రీనుబాబు బ్లాక్ బెల్ట్ 7వ డాన్ జపాన్ డిప్లమా విద్యార్థులకు ఎగ్జామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేందర్‌రెడ్డి పాల్గొని ప్రతిభ చాటిన విద్యార్థులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందించి మాట్లాడారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా కరాటే, తదితరాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డోజె ఇన్‌చార్జ్ సీహెచ్.అఖిల్, సీనియర్ బ్లాక్ బెల్ట్ పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల ఆస్తులను పరిరక్షించాలి



నర్సంపేట : దేవాలయాలకు దాతలు అందజేసిన భూములు, ఆస్తులను పరిరక్షించాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత ఆకాంక్షించారు. పట్టణంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ధూపదీప నైవేద్య పథకంలో ఉన్న ఆలయాల అర్చకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆలయాలకు సంబంధించిన వ్యవసాయ భూములు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత అర్చకులతోసహా అందరిపైనా ఉందన్నారు. ఆలయాల రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ఆలయాలు సమకూరిన ఉత్సవ విగ్రహాలతోపాటు ఆభరణాల వివరాలను అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిపారు. తొలుత 43(10) రిజిస్ట్రేషన్ మార్పు చేర్పుల గురించి, ల్యాండెండ్ ప్రాపర్టీస్ ఉన్న ఆలయాలకు బ్యాంకు ఖాతా తెరిచి, రిజిస్ట్రేషన్ అయి పబ్లికేషన్ కాని ఆలయాలను పబ్లికేషన్ చేయడానికి సంబంధించిన సమాచారం అర్చకుల నుంచి తీసుకున్నారు. సమావేశంలో ధూపదీప నైవేద్య పథకం అర్చక సంఘం డివిజన్ అధ్యక్షుడు దేవరకొండ అన్వేశ్ శాస్త్రి, ఉపాధ్యక్షుడు బీవీఎస్.శాస్త్రి, బాధ్యులు సతీశ్, అర్చకులు పాల్గొన్నారు.

బీజేపీతోనే పేదలకు సంక్షేమ పథకాలు



నల్లబెల్లి : కేంద్రంలోని బీజేపీతోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తడుక వినయ్ గౌడ్ తెలిపారు. మహబూబాబాద్ ఎంపీగా సీతారాం నాయక్‌ను గెలిపించాలని కోరుతూ పార్టీ శ్రేణులతో కలిసి మండల కేంద్రంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడారు. సీతారాం నాయక్‌ను గెలిపించి ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయిందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు కోటి, యువమోర్చా మండల అధ్యక్షుడు సుదగాని ప్రమోద్, నాయకులు రమేశ్, మనోహర్, శ్రీకాంత్, లోకేశ్, భరత్, సిద్దు, రాజేశ్, వెంకన్న పాల్గొన్నారు.

బలరాంనాయక్‌ను గెలిపించండి



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

దుగ్గొండి : మహబూబాబాద్ ఎంపీగా కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచిన బలరాంనాయక్‌ను గెలిపించాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. మండలంలోని బంధంపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హుస్సేన్‌పల్లి సుధాకర్, ఎక్కటి రాజిరెడ్డి, సుమన్, బుస్సారి రాజు, అల్లాపురం రాజేందర్, మోర్తాల నాగరాజు ఆ పార్టీకి రాజీనామా చేసి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే మాధవరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. పేదల సంక్షేమానికి పార్టీ, ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు ఎంపీగా బలరాంనాయక్‌ను గెలిపించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి కిరణ్‌రెడ్డి, నాయకుడు గాదం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలిస్తేనే బడుగులకు న్యాయం



వర్ధన్నపేట : ప్రచారం చేస్తున్న నాయకులు



నెక్కొండలో..

వర్ధన్నపేట : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి కేంద్రంలో అధికారంలోకి వస్తేనే బడుగులకు న్యాయం జరుగుతుందని కౌన్సిలర్ సమ్మెట సుధీర్, పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ స్పష్టం చేశారు. వరంగల్ ఎంపీగా కడియం కావ్యను గెలిపించాలని కోరుతూ పట్టణంలో కౌన్సిలర్ సమ్మెట సుధీర్, ఇల్లందలో పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్, సత్యనారాయణ మాట్లాడారు. బీజేపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని చెప్పారు. పదేళ్లుగా ఎన్నికల హామీలు విస్మరిస్తూ బీజేపీ మోసపూరిత పాలన సాగిస్తోందని తెలిపారు. కార్యక్రమాల్లో నాయకులు పోశాల వెంకన్న, మల్లెపాక సమ్మయ్య, తాళ్లపెల్లి శ్రీనివాస్, కుమారస్వామి, సమ్మయ్య, సమ్మెట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా బలరాంనాయక్‌ను గెలిపించాలని..

నెక్కొండ : మహబూబాబాద్ ఎంపీగా బలరాం నాయక్‌ను గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ ఆధ్వర్యంలో మండలంలోని గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి కొలువుదీరనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మండలం అభివృద్ధి చెందిందని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలే చోటు చేసుకున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, సంపత్, మహేందర్, విజేందర్, లింగమూర్తి, సాంబయ్య, రాజిరెడ్డి, రత్నం, రామ్మూర్తి, కృష్ణయ్య, మల్లయ్య, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌కే టీజేఎస్ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నర్సంపేట రూరల్ : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే తెలంగాణ జనసమితి (టీజేఎస్) మద్దతిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తెలిపారు. నర్సంపేటలో ఆదివారం నిర్వహించిన ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ గడచిన పదేళ్లపాటు నిరంకుశ పాలన సాగించిందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు అనేక మోసపూరిత చట్టాలను తీసుకొచ్చిందని చెప్పారు. స్వదేశీ పరిశ్రమలను పెంచకపోగా దేశంలో వ్యాపారం చేయడానికి విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని ధ్వజమెత్తారు. విదేశీ పెట్టుబడులతో దేశం అభివృద్ధి సాధిస్తుందన్న అబద్ధపు ప్రచారంతో విదేశీ ఉత్పత్తి పెట్టుబడిని గాలికి వదిలేశారని మండిపడ్డారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పెట్టుబడిదారులకు కట్టబెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలను విస్మరిస్తూ కార్పొరేట్ సంస్థలకు వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను దానం చేసిందన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని సైతం తప్పుదోవ పట్టించి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టిందని తెలిపారు. మహబూబాబాద్ ఎంపీగా కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచిన పోరిక బలరాంనాయక్ గెలుపునకు కృషి చేయాలని శ్రేణులకు తెలిపారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జావిద్, రాష్ట్ర నాయకులు గుంటి రాంచందర్, గుంటి సంజీవ, సోల్తి సాయికుమార్, సాంబరాతి మల్లేశం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో ప్రభుత్వ మార్పు తప్పదు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సంగాని మల్లేశ్వర్, నాయకులు

నర్సంపేట : కులగణన చేయకుండా ఓబీసీలను అవమానించిన నేపథ్యంలో కేంద్రంలో ప్రభుత్వ మార్పు తప్పదని ప్రజాసంఘాల జేఏసీ వైస్ చైర్మన్, పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లేశ్వర్ అన్నారు. 'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం, సామాజిక న్యాయాన్ని సాధించుకుందాం, కేంద్రంలో మార్పు కోసం ఓటేద్దాం' కరపత్రాలను ఎట్టణంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లేశ్వర్ మాట్లాడారు. కులగణన చేయకపోవడం వల్లే సామాజిక రాజకీయాల్లో అట్టడుగు వర్గాలు రాణించలేకపోతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో 70 శాతం దేశ సంపద 10 శాతంగా ఉన్న సంపన్నులకు మాత్రమే దక్కి 80 శాతంగా ఉన్న పేదలు ఆర్థిక సంక్షేమంలో చిక్కుకుపోయారని తెలిపారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, తదితర అనేక హామీలు గుప్పించి ఓట్లు దండుకుని పదేళ్లపాటు బీజేపీ మోసపూరిత పాలన సాగించిందని చెప్పారు. కార్యక్రమంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గట్టి ఎల్లయ్య, పాస్ నాయకులు అప్పని సతీశ్ కుమార్, తెలంగాణ జేఏసీ నాయకులు డాక్టర్ సుధాకర్, మేడిశెట్టి శ్రీనివాస్‌రావు, వడ్డే కుమారస్వామి, లక్కర్సు రమేశ్ పాల్గొన్నారు.